# వరదల్లో నేనే.. ఆపదలో నేనే..

- నేను చేసిన అభివృద్ధి.. ప్రజల కళ్లముందే ఉంది
- నిరంతరం ప్రజల మధ్యే నా జీవనం
- ప్రజా సంక్షేమానికే నా జీవితాన్ని అంకితం చేశా
- ఓటు అడిగేందుకు ప్రతిపక్షాలకు అర్హత లేదు
- అభివృద్ధి, సంక్షేమాలే మా నినాదాలు
- నాలుగోసారి నా గెలుపును ప్రజలు నిర్ణయించారు
- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్‌తో ముఖాముఖి



బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ, నవంబర్ 29: మంచికి మారుపేరు.. నిస్వార్థానికి నిలువెత్తు నిదర్శనం.. చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలుస్తున్న మహానాయకుడిగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పేదల పెద్ద దిక్కుగా.. అంచెలంచెలుగా ఎదిగిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చిన్నా.. పెద్ద అనే తేడా లేకుండా అందరినీ అన్నా అంటూ ఆప్యాయంగా పలుకరిస్తూ అడిగిన పనులను ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజల కోసమే నా జీవనం అంటూ నిత్యం ప్రజల్లో ఉండే ఈ మాస్ లీడర్‌కు ప్రజల్లో విపరీతమైన ఆదరణ, మంచిపేరు నిలిచింది. అందరూ ముందుగా.. పెద్దాయనా అంటూ సొంతింటి మనుషుల్లా పలుకరిస్తూ రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అందరిని కలుపుకొంటూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నేతగా ప్రకాశ్‌గౌడ్ మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా అఖండమైన విజయాలతో దూసుకుపోతున్నారు. మరోసారి అధిష్టానం ఆయన సేవలను గుర్తించి టిక్కెట్ కేటాయించింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు, కుల, కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు యువజన సంఘాలు ఎక్కడికక్కడా ఏకగ్రీవ తీర్మాణాలు చేసి ఈసారి కూడ మాకు పెద్దాయనే కావాలంటూ తేల్చిచెబుతుండటంతో ఇక నాలుగోసారి ఆయనకు తిరుగులేదని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ప్రజల మనిషిగా మాస్ లీడర్‌గా అందరికీ అందుబాటులో ఉండే రాజేంద్రనగర్ నియోజకవర్గం పెద్దాయన.. నమస్తే తెలంగాణతో తన మనోభావాల్ని పంచుకున్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

### ఎన్నో పనులు చేశాం..

మూడు పర్యాయాలుగా రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నా.. అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగకరమైన పనులు ఎన్నో చేశాం. అదేవిధంగా బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందజేశాం. ఆసరా పింఛన్లు 29,575 మందికి రూ.6కోట్ల 87లక్షలు ప్రతి నెల అందిస్తున్నాం, కల్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకం కింద ఇప్పటి వరకు 5,390 మందికి రూ.48కోట్ల 31లక్షలు అందించాం. రైతుబంధు ద్వారా ప్రతి పంటకు 75,000 మంది రైతులకు ఇప్పటి రూ.67కోట్ల 27లక్షలు, రైతు బీమా ద్వారా 145 మందికి రూ.7కోట్ల 45లక్షలు, దళితబంధు ద్వారా 100 మంది లబ్ధిదారులకు రూ.8కోట్ల 24లక్షలు, సీఎం సహాయనిధి ద్వారా రూ.10కోట్లు ఇలా మైనార్టీలకు, బీసీలకు, కేసీఆర్ కానుక, మైనార్టీ డ్రైవర్ కం ఓనర్ కార్ల పంపిణీ, దళితబంధు సీట్ వాహనాలు అనేక పథకాలను నిరంతరం అందిస్తున్నాం. నియోజకవర్గం పరిధిలోని నార్సింగి మున్సిపలిటీలో రూ.294కోట్లు, మణికొండ మున్సిపాలిటీలో రూ.258కోట్లు, శంషాబాద్ మున్సిపలిటీ రూ.420కోట్లు, బండ్లగూడ మున్సిపాలిటీలో రూ.177కోట్లు, శంషాబాద్ మండల పరిధిలోని గ్రామాల్లో రూ.60కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం. ఇంకా భవిష్యత్తు అవసరాలను గుర్తించి ప్రణాళికాప్రకారం ముందుకు సాగుతాం. ప్రజల అవసరాలను గుర్తించి అవసరమైన చోట ప్రత్యేకంగా నిధులను సైతం కేటాయించి పనులను జరుపుతున్నాం.

### అభివృద్ధే నినాదం.. సంక్షేమమే విధానం

అభివృద్ధే నినాదం.. సంక్షేమమే మా విధానం. కరోనా వస్తే కనిపించని ప్రతిపక్షాలు, వరదలు వస్తే కనిపించని నాయకులు ఓట్లు రాగానే రోడ్లపై తిరుగుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిని ప్రజలు గుర్తుంచుకొని కారు గుర్తుకు ఓటు వేస్తామని నార్ణయించుకున్నారని తెలిపారు.

### బీఆర్ఎస్‌కే ఆదరణ..

మూడు పర్యాయాలుగా రాజేంద్రనగర్‌లో గులాబీ జెండాను ఎగురవేస్తున్నాం. ప్రజల ఆశీస్సులతో ప్రతి ఇంటి కష్టాలు నావే అన్నట్లు ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాను. ఇప్పటికే వేలాది కోట్లతో వైద్యశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాఠశాలల అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, రహదారులు, లింకు రోడ్ల అభివృద్ధి, శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రూ.587కోట్ల నిధులతో రిజర్వుయర్ల నిర్మాణం జరుగుతున్నాయి. భవిష్యత్తులో మరోసారి గెలిపించిన తర్వాత యువజన సంఘాలకు ప్రత్యేక లైబ్రరీలు, క్రీడాస్థలాల కేటాయింపులు, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, అర్హులందరికీ డబుల్‌బెడ్ రూంలు, నూతన మ్యానిఫెస్టోలోని అనేక అంశాలను అమలు చేస్తాం. ప్రతి మున్సిపల్ వార్డులో ఉచిత ఆరోగ్యకేంద్రాల ఏర్పాటు, గ్రామ పంచాయతీల్లో జనాభాను బట్టి ఆస్పత్రుల నిర్మాణాలు చేయాలి, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయడంతో పాటు భవిష్యత్తు తరాల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను చేపట్టడం, ప్రజలకు అందుబాటులో ఉండూ సేవలందించాలి.

### ప్రతిపక్షాలవి తప్పుడు హామీలు

ఎన్నికల్లో గెలిచేందుకు ప్రతిపక్షాలు తప్పుడు హామీలు ఇస్తున్నారు. అధికార దాహంతో నోటికొచ్చిన మాటలు చెబుతున్నారు. వారి తప్పుడు మాటలు ప్రజలు నమ్మరు. అభివృద్ధి, సంక్షేమాలే మా పార్టీ విధానాలు, అవినీతికి కేరాఫ్‌గా ఉన్న పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరు. ప్రజలకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా, తన ఇంటి తలుపు తట్టే చనువు నియోజకవర్గ ప్రజలకు ఉందన్నారు. తాను పిలిస్తే పలికే వ్యక్తినన్నారు. ప్రజలు తనను తమ ఇంటి బిడ్డగానే భావిస్తారన్నారు. కరోనా సమయంలో తాను ప్రజలు అందించిన సేవలు వారిని తన వారిని చేశాయన్నారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో ప్రజల వెంటే ఉన్నానన్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం..

## నేడే శాసనసభ ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- నియోజకవర్గంలో 5,81,937మంది ఓటర్లు
- పురుషులు 2,87,250, మహిళలు 2,94,643, ఇతరులు 44
- 6000మంది సిబ్బంది, 542 పోలింగ్ బూత్‌లు
- దివ్యాంగులకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు




పోలింగ్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ భారతీ హోలికేరి

మణికొండ, నవంబర్ 29 : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శాసనసభ సాధారణ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమయ్యింది. ఎన్నికల నిర్వహణ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేలా అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ముందు నుంచే అన్ని జాగ్రత్తలు తీసుకున్న అధికారులు ప్రణాళిక ప్రకారం పోలింగ్‌కు ఒకరోజు ముందే అన్ని పనులను పూర్తిచేశారు. ఇక ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడమే తరువాయిగా మారింది. వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల అధికారులు ఆది నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఎన్నికల సిబ్బంది మొదలుకొని, పోలీస్ బందోబస్తు వరకు పోలింగ్ కేంద్రాల వారీగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సాధారణ ఎన్నికలకు నియోజకవర్గం వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగించుకోనున్న 5,81,937 మంది ఓటర్లు ఉండగా 542 పోలింగ్ బూత్‌లకు ప్రిసైడింగ్ అధికారులు 542, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 542, బీఎల్వోలు 542, ఇతర సిబ్బంది 2168 మంది నిర్వహణ సిబ్బందితో ఎన్నికల నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈసారి దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్, హెల్ప్‌డెస్క్ తదితర సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల సామగ్రి వీవీప్యాట్, ఈవీఎంలు పోలింగ్ సిబ్బందిని బుధవారం ముందుగా సూచించిన పోలింగ్ కేంద్రాలను తరలించనున్నారు. నేడు(గురువారం) ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే పోలింగ్‌కు అన్నిరకాల ఏర్పాట్లను చేపట్టారు. ఇందుకు ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు వీడియోగ్రాఫర్, సెక్టోరల్ అధికారి పర్యవేక్షణలో ఎన్నికలు జరుపుతున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. అదేవిధంగా అన్నిచోట్ల ఎప్పటికప్పుడు పటిష్టమైన భద్రత ఏర్పాట్లకు 110మంది పారామిలట్రీ బలగాలు, ఇద్దరు డీసీపీలు, నలుగురు అడిషనల్ డీసీపీలు, 12మంది డీఎస్పీలు, 24మంది ఇన్‌స్పెక్టర్లతో పాటు 198 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 1800మంది సివిల్ పోలీసులతో భద్రతా చర్యలను చేపట్టనున్నారు.

### ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోండి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోలికేరి

నేడు జరిగే శాసనసభ సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో బాధ్యత కలిగిన పౌరులుగా నిలవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోలికేరి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామన్నారు. పోలింగ్ సమయంలో సాంకేతిక లోపాలను ముందస్తుగా నిలువరించేందుకు గాను ఒక్కో పోలింగ్ కేంద్రానికి అదనంగా మూడు ఈవీఎం, వీవీప్యాట్‌లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని.. సమయంలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి బండ్లగూడలోని లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పటిష్టమైన భద్రత మధ్య ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపర్చుతామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే ఈసారి మరింత పెరుగుతుందని ఆశిస్తున్నామని కలెక్టర్ అన్నారు.

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓటర్ల జాబితా వివరాలు

| మండలం | మొత్తం ఓటర్లు సంఖ్య | పురుషులు | మహిళలు | ఇతరులు |
|---|---|---|---|---|
| గండిపేట | 1,79,627 | 93,587 | 86029 | 10 |
| శంషాబాద్ | 87,256 | 44,022 | 43,228 | 11 |
| రాజేంద్రనగర్ | 3,15,054 | 1,49,641 | 1,65,386 | 23 |
| **మొత్తం** | **5,81,937** | **2,87,250** | **2,94,643** | **44** |



రాజేంద్రనగర్‌లో ఈవీఎంలతో బయలుదేరుతున్న సిబ్బంది దృశ్యం



పోలీసు అధికారులు బందోబస్తుపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం